# శుద్ధ చైతన్యమే తానైన
# పూజ్య శ్రీ భరద్వాజ మాష్టార్ గారు

*మాష్టారు భౌతికంగా మన మధ్య ఉన్నప్పటి లీలలు*

సత్సంగం - ఆచరణ



కాపీల కొరకు వ్రాయండి
శ్రీ సాయిమాష్టర్ సేవాట్రస్ట్
గొలగమూడి, నెల్లూరు జిల్లా - 524 321



## ఆశీస్సులు

చరిత్ర పారాయణతో శ్రీ సాయి బాబా మహిమ తెలిసి, మన మనస్సు పరవశిస్తుంది. కానీ ఆయన ఎల్లప్పుడూ, అన్ని చోట్ల ఉంటారన్న సంగతి మరుస్తుంటాము. అది గుర్తుంచుకొనడమే వారి విశేషానుగ్రహం పొందేందుకు సాధనం. అందుకు మనము నిత్యము మన హృదయగత భావాలను భావయుక్తంగా ఆయనతో చెప్పుకొనడం అభ్యాసం చేయాలి. అదే భజన పాటల యొక్క లక్ష్యం. అందుకే జ్ఞానేశ్వరుడు, తుకారాముల నుండి మహనీయులందరూ ప్రార్థనలన్నీ సరళమైన దేశీయ వ్యవహారిక భాషలలోనే వ్రాసారు. అవి పాడుకొనడమంటే, మన హృదయాలు వారి ప్రత్యక్ష సన్నిధి అనుభవిస్తూ వారితో సంభాషించడమే. అట్టి ఉత్తమ ప్రయోజనం సాయి భక్తులందరికీ అందజేయాలన్నదే మా ప్రయత్నం. ఆ లక్ష్యం నెరవేరితే అదే చాలు.

ఇట్లు
ఆచార్య ఎక్కిరాల భరద్వాజ.
1-2-1989.

నేను నిద్ర లో ఉన్నా మీ ప్రార్థనలు వింటూనే ఉంటాను మీరు అడిగిన వన్నీ తీర్చును. మీకేది మంచిదో అదే చేస్తాను. కర్మ వర్క్ అవుట్ అవ్వాలి. (భరద్వాజ)

## భరద్వాజ మాష్టారు స్వయంగా నాతో చెప్పిన విషయం

"మా నలుగురి అన్నదమ్ములలో, మాపెద్దన్న గారైన కృష్ణమాచార్యుల వారికి నేనంటే ఎంత అభిమానమో! నేను వారింటికి పోతే, ఆయన శలవు పెట్టి ఇంటిలోనే ఉండేవారు. నేను అక్కడ నుండి బయటకు వచ్చేవరకూ, ఆయన ఒక్క క్షణం కూడా ఏమారేవారు కాదు. నాకు అక్కడున్న పిల్లలు మంచి నీళ్ళు ఇవ్వబోతుంటే ఈయన అడ్డం వెళ్ళి " ఒరేయ్! ఈ గ్లాసుడు మంచినీళ్ళయినా వాడికి నన్ను ఇవ్వ నియ్యండిరా" అనేవారు.

కృష్ణమాచార్యుల వారు ఎందుకు అలా చేసారు? కేవలం ఆప్యాయత వల్ల కాదు. రమణ మహర్షి చెప్పినట్లు ఒక మహనీయుని మరొక మహనీయుడే గుర్తు పట్టగలడు. కృష్ణమాచార్యుల వారు మహనీయుడు గనుక, భరద్వాజ మాష్టారు గొప్ప మహాత్ముడని ఆయన ఆనాడే గుర్తించారు.

పెసల సుబ్బురామయ్య



## మేడిశెట్టి సరస్వతి గారు, w/o M. సత్యనారాయణ చిన్న కొండే పూడి, సీతానగరం, తూర్పుగోదావరి జిల్లా వారి దివ్యానుభవం:

శ్రీ వెంకయ్య స్వామి వారి కృప వల్ల ఇల్లు కట్టుకోవడం జరగటంతో మొక్కు ప్రకారం శ్రీ స్వామి వారి దర్శనానికి గొలగమూడి వచ్చారు. వారు శ్రీ సాయి మాష్టార్ నిలయంలో అడుగు పెట్టగానే శ్రీ వెంకయ్య స్వామి, భరద్వాజ మాష్టారు, శ్రీ షిరిడీ సాయిబాబాల ఫోటోలు చూచారు.

రచయిత, సామాన్య మానవుడు అయిన శ్రీ భరద్వాజ మాష్టారి ఫోటో మధ్యలో పెట్టడం, గొలగమూడిలో ఆరాధ్య దైవమైన శ్రీ వెంకయ్య స్వామి వారి ఫోటో ఒక ప్రక్క, సాయినాధుని ఫోటో మరో ప్రక్క పెట్టడం వారికి వింత అనిపించింది. ఉదయ హారతి అప్పుడే అయి గురు చరిత్ర గేయం చదువు తుంటే వీరు కండ్లు మూసుకొని శ్రీ వెంకయ్య స్వామి వారిని స్మరిస్తున్నారు. అప్పుడు ఒక ప్రకాశవంతమైన జ్యోతి శ్రీ సాయి బాబా ఫోటోలో నుండి, శ్రీ వెంకయ్య స్వామి వారి ఫోటోలోనికి శ్రీ వెంకయ్య స్వామి ఫోటోలో నుండి శ్రీ భరద్వాజ మాష్టారు ఫోటోలోనికి వచ్చి లయం కావడం దృశ్య రూపంగా గోచరింపజేసి శ్రీ స్వామివారు మాముగ్గురకూ ఎట్టి భేదము లేదు అని తెలియబరచారు. కనుక అచ్చట ఉన్నది కేవలం నిర్జీవమైన పటాలు కావని మేము ముగ్గురమూ సజీవంగా బేధమేమి లేకుండా అచ్చట ఉండి మీ యొక్క ప్రతి అలోచన, మాట, చేతలను తెలుసుకుంటూ తగిన ప్రతిఫలం ఇస్తూ భక్త రక్షణ, శిక్షణ చేస్తున్నామని తెలుపుతున్నారు.

## కాలాన్ని సద్వినియోగం చేయడం:

**1. నూనె దీపం ముందు చదవడం: 1975-82** ప్రాంతంలో ఇప్పుడుండే చార్జిలైట్లు లేవు. ఉన్నా అవి మాష్టారి దగ్గరకు రాలేదు, కరెంటు పోతే లాంతరు తేవాలి. అందులో కిరోసిన్ ఉండాలి, వత్తినలపాలి, గ్లాసుతుడవాలి. ఇవన్నీ ముందు చూసుకున్నా వెలిగించి తెచ్చేందుకు కొంత వ్యవధి పడుతుంది. బాబాపటాల దగ్గరనే వారు చదువుతుంటారు. గనుక అక్కడ వెలిగే నూనె దీపం ముందు చదువు సాగించేవారు.

**2. గీచి పడేసిన అగ్గిపుల్లతో అండర్ లైన్ చేయడం.**

ముఖ్య మైన విషయం పుస్తకంలో అండర్ లైన్ చేయాలి. సమయానికి పేనాలో రీఫిల్ అయిపోయింది. ఇక కాలం వృధా పుచ్చుకుండా వెంటనే గీచి పడేసిన అగ్గిపుల్ల తో ఒక గీత రెండంగుళాళ పొడువున గీస్తారు, మరొకసారి మరొక గీచిన అగ్గిపుల్ల ఇలా చేస్తారే కాని చదివే పని ఆపరు.

3. ఒక రోజు వారే చెప్పారు. నేను ప్రతిరోజు నాల్గుగైదు రకాలపుస్తకాలు చదువుతాను.

1. లెట్రిన్‌కు వెళ్ళినపుడు ఆ పది నిమిషాలు ఒక పుస్తకం.
2. పండ్లు తోముకున్నంత సేపు మరొక పుస్తకం.
3. కాలేజి కి వెళ్ళేటప్పుడు ఒక పుస్తకం.
4. కాలేజిలో పని లేనప్పుడు ఒక పుస్తకం.
5. సత్సంగంలో మరొక గ్రంధం.

ఇలా నేను ఒక నిమిషం వృధాకాకుండా మనసును చదువుట అనేపనిలో నిమగ్నం చేస్తాను. బాబాగారు మనకిచ్చిన సదవకాశం సద్వినియోగం



చేయాలిగదా. ఈ అవకాశం పోతే మరలా రాదు. రేపుకాదు గదా, మరుక్షణంలో మనమేమౌతామో మనకు తెలియదు కదా! ప్రయాణాలు, అనారోగ్యాలు, అతిధులు ఇంకెన్ని వస్తాయో" అన్నారు.

## శ్రీ మాష్టారు మామిడి పండు తినడం:

శాస్త్రవాక్యాలను, శ్రీ సాయి ఆదేశాలను మిళితం చేసి తన ఆచరణలో పొందుపరచడమే శ్రీ మాష్టారి గొప్పదనం. తన వారందరూ తిన్నాకనే యజమాని తినాలనేది శాస్త్రవాక్యం. కాని శ్రీ మాష్టారు భోంచేశాకనే అమ్మగారు వారి ఉచ్ఛిష్టాన్ని ఆరగించేవారు. మామిడి పండ్ల సీజను వస్తే ఒక గంప రసాల మామిడి పండ్లు కొనేవారు. రసాలమామిడి పండ్లు బాగా నలిపి అన్నం దగ్గర ఉంచితే మజ్జిగన్నంలోకి తినేవారు. ఆ పండు తాను కొరికి చిన్న రంధ్రం చేసేవారు. కుడి చేత్తో ఆ పండును వత్తుత్తూ అందులోని రసమంతా ఊటేసేవారు. తొక్కముట్టెతో సహా అక్కడున్న ప్లేటులో ఉంచేవారు. అమ్మగారు దాన్ని ప్రసాదంగా కొంత తీసుకుని మిగిలినది అందరికి పంచేవారు.

శ్రీ మాష్టారు ఒక్కమామిడి పండు రసం త్రాగితే ఇంటెల్లపాది మాత్రమేగాక నాలాంటి అతిధులకు కూడా తలా ఒక పండిచ్చేవారు. వారు ఒక్క పండు తినాలంటే కనీసం ఇరవై పండ్లన్నా అందరికీ ఇచ్చేవారు. వాళ్ళ ఇంట్లో నలుగురే కదా! ఇరవైమంది ఎక్కడొచ్చారని అనుకోకండి. శ్రీ మాష్టారుగారు, అమ్మగారు, వేదమ్మా, ద్వారకానాధ్, సత్యం, విక్రం, మాష్టారుగారి అత్తగారు, శ్రీ దేవిగారు, మందిచ్చే వెంకటగిరి డాక్టరమ్మ, మద్రాసు లక్ష్మక్క, సుభాషిణీ, రామారావు, ప్రసాద్, పాచి పనిచేసే ఆమె, గుడ్డలు పిండే ఆమె, నిత్యం పూలు తెచ్చేవారు, సమయానికి వచ్చే అతిధులు, ఇంతమందికి వారింట్లో నిత్యం భోజనాలు

ఉండేవి. నాదెంతటి దౌర్భాగ్యపు జీవితమో! ఒక్కసారైనా ఇంట్లో అందరికి సమానంగా ఇలా పంచానా. అందరిలో సాయిని చూడడమంటే ఏమిటో, ఎలాగో తన ఆచరణ ద్వారా నేర్పిన మహనీయుడుగదా! శ్రీ మాష్టారు.

శ్రీ మాష్టారు ఇంత గొప్ప మహనీయుడుగా ఎలా తయారయ్యారు అనేందుకు జవాబు వారి ఆచరణే.

*గురు మధ్యేస్థితం విశ్వం విశ్వమధ్యేస్థితో గురు:*
*గురు ర్విశ్వంనచాన్యోస్తి తస్మై శ్రీగురువేన్నమ:*

అన్న మాటను అక్షరాల పాటించారు.

ఒక రోజు వాళ్ళ విద్యానగర్ లో బాత్ రూంలో కుక్క ఈనింది. అప్పుడు శ్రీమాష్టారుగారు ఆ కుక్కకు పెరుగన్నం తినిపించి దాని మూతి తుడిచి దానిపైన ఒక దుప్పటి కప్పి వచ్చారు. అ సమయలో అక్కడికి వెళ్ళిన శ్రీమతి రామిరెడ్డి సరస్వతమ్మ గారితో "కుక్క ప్రసవిస్తే అన్నం పెడుతున్నానమ్మ" అన్నారట. కుక్క ఈనింది అని వారనడం లేదు. ప్రసవించింది అని అంటున్నారు. కుక్కకు అన్నం తినిపించి మూతి తుడవడమేమిటి? ఆ కుక్కకు దుప్పటి కప్పడమేమిటి? ఆ విధమైన ప్రవర్తన ద్వారా వారు కుక్కను కుక్కగా చూడకుండా బాబాగానే చూస్తున్నారు. అంటే విశ్వంలో ప్రతీదీ, జీవికాని, నిర్జీవికాని బాబా రూపంగానే నిరంతరం తన ఆచరణలో భావిస్తున్నారు. అలా మనం కూడాచేస్తుంటే అదే అనన్యచింతనై మనలను తరింపచేస్తుందని భోధిస్తున్నారు.

ఒకరోజు పై సరస్వతమ్మగారి ఎద్దు కొత్తపాళెం నుండి మూడు కిలోమీటర్ల దూరం అడ్డంగా పరుగెత్తి, పరుగెత్తి విద్యానగర్ లోని శ్రీ మాష్టారి సత్‌సంగం హాలులో ముందు కాళ్ళు రెండు పెట్టి వెనుక కాళ్ళు



హాలు బయటుంచి నాలుక చాపి రొప్పుతూ నిలుచుంది. మనమైతే ఆ ఎద్దును కర్ర తీసుకుని తరిమేస్తాము కాని శ్రీ మాష్టారు బక్కెట్టుతో నీరు తెచ్చిదాని ముందు పెట్టి త్రాగమని ప్రార్ధిస్తూ, దాని ముఖాన పసుపు కుంకుమ పెట్టి అరటిపండ్లు తినిపిస్తున్నారట. ఈలోగా ఆఎద్దును వెంబడించి పరుగెత్తుకొస్తున్న సరస్వతమ్మగారి సేద్యగాడు వచ్చి ఆ ఎద్దును తోలుకపోయాడు. శ్రీ మాష్టారు ఆ ఎద్దు రూపంలో వచ్చిన తన గురువు గారిని దర్శించి, నీళ్ళు పెట్టడం, పసుపు కుంకుమ నుదుట పెట్టడం, అరటిపండ్లు నైవేద్యంగ నోటికందించడం చేస్తున్నారు. ఋణాను బంధాన్ని గుర్తించి ఏ ప్రాణినీ తోలేయ్యవద్దు. అన్ని రూపాలలో నేనే ఉన్నానని గుర్తుంచుకో అన్న బాబా మాటను అలా ఆచరిస్తూ మనలను గూడా అలానే ప్రవర్తించమని బోధిస్తున్నారు.

కమిటీ మెంబర్స్ లో ఒకాయన బాబా విగ్రహం కొనటానికి డబ్బుకై ఒక సినీ యాక్ట్రస్‌తో డాన్స్ పెట్టించాలని సలహా ఇచ్చారు. బిక్షచేసి బాబా విగ్రహం కొనాలిగాని అలాంటి పద్ధతుల ద్వారా కొనకూడదు అని ఇలా చెప్పారు. ముఖ్య దాతల పేర్లు బాబా విగ్రహం క్రింద వేయిస్తే ఎప్పుడు బాబావిగ్రహం చూచినా వెంటనే క్రిందనే వేసిన పేర్లు, ఆ మనుషులు గుర్తురావడం తప్పించి ఆయన మహిమ గుర్తురాదు. చూచే వాళ్ళందరూ వాళ్ళపేర్లు చదువుతుంటారు. అలా గాక అందరి వద్దా భిక్ష చేసి విగ్రహం పెడితే మందిరానికి వచ్చినప్పుడు బాబాను చూడగానే ఇది మన విగ్రహం. ఇందులో మన భాగం ఉంది. మన బాబా అన్న భావం వస్తుంది అన్నారు. ఇది మనందరమూ ఆచరించి తరించాలని శ్రీ మాష్టారు గారి అభిమతము.

## 3-4-81 విద్యానగర్ లో శ్రీమాస్టారు గారి సత్ సంగము:

పరిస్థితులు ఎట్లా ఉండాలో అట్లాగే వస్తాయి. మనం చింతిస్తే చింతే మిగులుతుంది. జీవితంలో ఏవో కావాలని కలలు కంటుంటే అవి నెరవారాల్సిన పనిలేదు. బలహీనతలను జీవితంలో కొనసాగిస్తుంటే అవెన్నటికీ ఆగక మనకు రాబోయే జన్మలనే మార్చివేస్తాయి. బలహీనతల వలన మనకు ఏమి ఒరిగేదిలేదని బాగా తెలుసుకోవాలి. బలహీనతలు ఉన్నంత కాలం సాధనలో ముందుకు పోలేము. అవి పనిచెయ్యడంలో ఆయారూపాలలో బాబా ఉన్న విషయం మరుగుపడుతుంది.

హాయిగా సుఖాలనే అనుభవించక కొంతసేపు బలహీనతలు, కోంతసేపు సాధన ఎందుకు? జీవితంలో మిగిలిన సమస్యలు ( ఆరోగ్యం వంటివి) మారాలి అని సాయిని ప్రార్థిస్తూ - దానికి సంబంధించిన బలహీనతలను విడవడం లేదు. బలహీనతలు, జీవితంలోని బాధలు ఒకే స్వప్నం లోనివి. అట్లాంటప్పుడు బలహీనతలు అట్లాగే ఉండి సమస్యలను మార్చడం జరగదు. కల మారితే రెండూమారి పోవాలి. దేహబాధలు, బలహీనతలు లేని స్వప్నం ఆరంభంకావాలి. దానికోసం, పళ్ళు బిగించి కృషి చేయాలి. ధ్యానం చేసినప్పుడు అంతా బాబా ఉన్నారని అనిపించి బలహీనతలు అణిగి పోయి మరలా బలహీనతలు తీవ్రమవుతాయి. ధ్యానంచేశాక అలసిపోయినట్లనిపించి ఇక చాలనిపిస్తుంది. అప్పుడు జగద్భావం ప్రారంభమయి నెమ్మదిగా మనసు బలహీనతలోకే జారుకుంటుంది. కాబట్టి అప్పుడు ఆసనాలు, ప్రాణాయామం, గ్రంధ పఠన లాంటివి చెయ్యాలి. బలహీనతకు మనస్సు లోంగకముందే జాగ్రత్తపడాలి.



## గ్రహణాలను గురించి శ్రీమాస్టారి మంచి మాట:

గ్రహణ సమయంలో దేవతలు అంతర్ముఖమై ఉంటారు. పూజలు చేసి నైవేద్యాలర్పించడం ద్వారా వారిని డిస్టర్బ్ చేసినట్లవుతుంది. మనము సత్సంగము చేయవచ్చు, ధ్యానం చేయవచ్చు, పారాయణ చేసుకోవచ్చు, ప్రదక్షిణ చేయవచ్చు అన్నారు. మందిరం మూయడం అవసరమా, లేదా అని మేము వారిని అడుగలేదు. వారు చెప్పలేదు.

ఒక చంద్రగ్రహణ సమయంలో నేను(పి. సుబ్బరామయ్య) విద్యానగర్ లోనే ఉన్నాను. శ్రీమాస్టారి సత్ సంగం హాలే అందరికీ మందిరం. విద్యానగర్‌లో సాయి మందిరం అప్పటికి నిర్మించబడలేదు. శ్రీమాస్టారి సత్ సంగ హాలు మూయలేదు. అదీగాక ఆగ్రహణ సమయంలో కూడ వారు సత్ సంగం చేస్తూనే ఉన్నారు. అదే సమయంలో శ్రీమన్నవ సత్యంగారు పళ్ళెంలో నీళ్ళుపోసి ఆనీటిలో రోకలి నిలబెట్టే ప్రయత్నం చేస్తుంటే కొందరు విద్యార్థులు వారి చుట్టూ మూగారు.

## కొత్తపాళెం - సరస్వతమ్మగార్కి శ్రీమాస్టారితో గల అనుభవములు ఈ విధంగా వివరిస్తున్నారు:

శ్రీమాస్టారు భౌతికంగా ఉన్నపుడు మా అమ్మాయి పెండ్లి జరిగిన మరు సంవత్సరం మాకు డబ్బుకు చాలా ఇబ్బందిగా వుండేది. మా అబ్బాయి చాలా దిగులుగా ఉండేవాడు. అది చూచి నేను మాస్టారికి లెటరు వ్రాశాను. శ్రీమాస్టారు దగ్గర నుండి నాకు లెటరు రాలేదు. కాని ఆ రాత్రి కలలో బాబా ఫొటో పెద్దది కనిపించింది. అందులో గణపతి, సరస్వతి, లక్ష్మీదేవి, దత్తాత్రేయుడు, బ్రహ్మ, విష్ణు, శివుడు ఫొటోలు

ఉన్నాయి. బాబా చేతిలో చరిత్ర వుంది. ఆ చరిత్రలోంచి డబ్బులు రాలుతున్నాయి. అలా బాబా ఫొటో నాకు కలలో కనిపించిన 15 రోజులకు మాకు ట్రాక్టరు కొనాలనిపించి కొన్నాము. అపుడు అందరికీ ట్రాక్టర్‌లు లేవు. అందువల్ల మా ట్రాక్టర్ బాడుగ రోజు కొంత డబ్బు వస్తుండేది. అప్పట్లో మాకు ఆర్థికమైన ఇబ్బందిలేకుండా పోయింది. ఎవరెలా అనుకున్నా నేను మాత్రం శ్రీమాష్టారికి చెప్పుకున్న నాసమస్య వారి అనుగ్రహం వలనే తీరింది అని అనుకున్నాను.

ఒకరోజు మాష్టారుగారింటికి ఏర్పేడు ఆశ్రమం నుండి వస్తూ నేను మా అమ్మమ్మగారు మాష్టారింట్లో దిగాము. మాష్టారుగారు టీ ఇప్పించారు. సమయం అపుడు 5 గంటలుంటుంది. అప్పటిలో ఇప్పటిలా ఆటోలు, రిక్షాలు విద్యానగర్‌లో లేవు. మేము బయలుదేరే సరికి 7 గంటలు అయ్యింది. అక్కడ అల్లుభాస్కర్ అనే స్టూడెంట్ ఉన్నారు. అతనిది మాఊరె. అతనూ మాతో వస్తానన్నాడు. మాష్టారు గారు "నేనూ వస్తున్నాను. మీరు పదండమ్మా అన్నారు". అడుగుల శబ్దం వచ్చి వెనక్కు చూస్తే ఎవ్వరు లేరు. ఆ శబ్దం మా అమ్మమ్మకు కూడా వినిపించిందట. అల్లు భాస్కర్ నవ్వినాడు. మేము బయలుదేరిన అరగంటకే మాఊరు చేరాము. మామూలుగా అయితే కనీసం 1 1/2 గంటలు పడుతుంది. అపుడు భాస్కర్ అన్నాడు, మాష్టారు అదృశ్యంగా మనతో వచ్చి వెళ్ళారు అని.

శ్రీమాష్టారు గార్ని గురించి వ్రాయడం అంటే సముద్రంలోని నీరు టమ్లర్ లో నుంచి తీయడమే. నాకు తోచింది వ్రాస్తున్నాను. శ్రీమాష్టారు భవరోగనివారకులే కాక భిషగ్వరులు అంటూ సరస్వతమ్మగారు వారి అనుభవం వివరిస్తున్నారు.



నాకు ఒకసారి బాగా కడుపులో నొప్పి వచ్చి బాధగా ఉండేది. డాక్టర్‌కు చూపిస్తే వెంటనే పెద్దాపరేషన్ చేయాలని, కడుపులో గడ్డలున్నాయి అని చెప్పారు. సరే మళ్ళీ వస్తామని ఇంటికి వచ్చేశాము. వెంటనే మాష్టారుగార్కి విషయం వివరిస్తూ ఒంగోలుకు లెటరు వ్రాశాను. ఆ తర్వాత మాష్టారు మాఇంటికి నాలుగు రోజుల్లో వచ్చేశారు. నన్ను పిలిచావేమిటమ్మా నీబాధేమిటి అన్నారు. నా కడుపులో వుండు సంగతి చెప్పాను. ఏమీ అవసరం లేదు. ఒకసారి శ్రీగురుచరిత్ర ఒకసారి సాయి చరిత్ర చదువు పోతుంది అన్నారు. సరేనని అన్నాను. స్వామి ఆ రాత్రి నిద్ర చేసి మరురోజు వెళ్ళిపోయారు. నేను ఆ రోజే ప్రారంభించి మూడు రోజుల్లో రెండు చరిత్రలు పూర్తి చేసాను. అయినా ఒకసారి డాక్టర్‌కు చూపిస్తే బాగుంటుందని మాతమ్ముడు ప్రభాకర్, నేను వెళ్ళి మరలా అదే డాక్టర్‌కు చూపించాను. ఆమె ఆశ్చర్యపడుతూనే కడుపులో గడ్డలు కరిగి పోయాయి. నీకింక ఆపరేషన్ జీవితంలో అవసరం లేదు అన్నది. ఇలా నా ఆరోగ్యం బాగు చేసింది ఆ డాక్టరా? మన బంగారు మాష్టారా? నాకెంతో ఆనందమైంది. వెంటనే శ్రీమాష్టారుకు లెటరు కూడా వ్రాశాను. అదేవిధంగా మరోసారి నాతలపైన ఒక గడ్డ లేచింది. డాక్టర్ కు చూపిస్తే అపోలో ఆస్పత్రికెళ్ళాలన్నారు. (మద్రాసు).

నేను శ్రీ మాష్టారికి ఈ విషయం వ్రాయగా వారు శ్రీ గురు చరిత్ర 7 సార్లు పారాయణ చేయమన్నారు. నేను రోజుకోసారి 7 రోజుల్లో 7 సార్లు చరిత్ర పారాయణ చేశాను. ఒక రోజు కలలో నాగడ్డ కరిగి పోయినట్లు కల వచ్చింది. ఒక 35 సంవత్సరాల బ్రాహ్మణ వ్యక్తి వచ్చి నా తల పై చేయి వుంచారు. మరు రోజు నాతలలో గడ్డ అలాగే ఉంది. కాని విచిత్రం మరు 2 రోజుల్లో అది కరిగి పోయింది. శ్రీ మాష్టారు గారే నాకు వైద్యులై రోగనివారణ చేశారు. కాని వారు వారి మీద ఉండకుండా ఉండాలని శ్రీ గురుచరిత్ర పారాయ ఫలితంగా అనే భావం

మనకు తెలుపుతారు. వారి సంకల్ప శక్తిని, వారి దివ్యత్వమును గుప్తంగా ఉంచి దత్తానుగ్రహంగా ప్రకటించేవారు.

## శ్రీ భరద్వాజగారు తరతమ బేధాలేమి లేనివారు:

ఒక రోజు మేము మా కుటుంబం మాచెల్లెళ్ళు, మా బంధువులు అందరం కలిసి మాష్టారుగారింటికి వెళ్ళాము. మాతోకూడ మా ఇంట్లోని పనిపిల్ల పొలంలో పనిచేసేవాళ్ళు వచ్చారు. మాష్టారుగారు అందరినీ కూర్చొమని ఒక్కసారిగా చెప్పారు. ఆయన అందరివైపు చూచి కులాసాగావున్నారా అన్నారు. మా మాష్టారుగారి దగ్గర ఎవ్వరికీ ప్రత్యేకతలుండవు. అందరిని పలకరించే విధానం ఒకేరకంగా వుండేది. ఆయన దగ్గర ధనవంతులైన వారికి అస్సలు గౌరవముండదు. మేము వెళ్ళిన కొన్ని నిమిషాలకు విద్యానగర్‌లో ఉండే కృష్ణమూర్తి చెల్లెలు అమ్ములు అనే అమ్మాయి వచ్చింది. బ్రాహ్మణుల అమ్మాయి. ఆ తరువాత మష్టారు గారు మాకందరికీ టీ తీసుకురమ్మన్నారు. ముందు టీ మా పొలంలో పనిచేసే వాళ్ళకిచ్చి, మా పనిపిల్లకిచ్చి ఆ తర్వాత మాకందరికీ ఇచ్చారు. అందరూ టీ త్రాగిన తర్వాత మాష్టారుగారు మీలో ఎవరైనా పాటలు పాడండమ్మా అన్నారు. అప్పుడు ఒకరిద్దరు కాలేజీ పిల్లలు సాయిమీద పాటలు పాడారు. నేను నమ:శ్శివాయ అనే పాటను పాడాను. కొన్ని చరణాలు పాడాక

"ఉరగ విభూషణ నీదగుమంత్రము నను సంధింప చేయునయా ఓం నమ:శ్శివాయ అంతయు నీవై యుండగ వేరే చింతలు నాకింకేలనయా - ఓం నమ:శ్శివాయ టక్కరి జగములో మాయకు లోబడి చిక్కితి నిన్నెటు గాంతునయా"



అనే ఈ పాట పాడుతుండగా మాష్టారుగారి కళ్ళలో నుండి కన్నీరు ధారగా కారుతున్నాయి. ఒక్క 5 నిమిషాలు పాట నిలిపిన తర్వాత కూడా ఆయన మనలోకానికి రాలేదు. అలా ఎందుకు కన్నీరు కార్చారో నాకిప్పటికీ అర్థం కాలేదు. ఆ తర్వాత మాష్టారి దగ్గర శెలవు తీసుకుని వచ్చేటపుడు ఆయన నాకొక జపమాల ఇచ్చారు. కానీ మంత్రము చెప్పలేదు. అది ఇప్పటికీ నా దగ్గరుంది. మరొకసారి వెళ్ళి నపుడు అడిగితే పంచాక్షరీ చేసుకోమన్నారు. కొంచెంసేపు ఆగి ఒక కాగితం పై మంత్రం వ్రాసి ఇచ్చారు. అదే నేను ఇప్పటికీ చేసుకుంటూ ఉంటాను. ఇతరులెవరి దగ్గరైనా ఉన్నతాధికారులకైనా ప్రత్యేకతలు ఉంటుంది, కాని మాష్టారు దగ్గర అలాంటి ప్రత్యేకతలు ఉండేవికావు. వారు మహాసమాధి అయ్యేంత వరకూ అలాగే గడిపి వెళ్ళి పోయారు. ఇదెవరికి సాధ్యం? శ్రీ భరద్వాజగారిది వసుధైక కుటుంబము. అయన తనకంటూ ఏదీ దాచుకుని ఎరుగరు. అయన బ్రాహ్మణులైనా అందరికీ ఆయనింట్లో ప్రవేశముండేది. ఎవరికి తగిన పని, వాళ్ళు చేసేవాళ్ళు. కొందరు ధ్యానం చేస్తుండేవారు. కొందరు చరిత్ర రాస్తుండేవారు. కొందరు (డిష్కషన్) మాష్టారుగారితో వాదిస్తుండేవారు. ఆయన కాలేజీ కెళ్ళిన వేళల్లో కూడా ఆ ఇంటితలుపులు తెరిచివుండేవి. ఆయన ఎప్పుడు పడుకుంటారో రాత్రి 12 గంటల వరకూ మాట్లాడుతూనే ఉండేవారు. ఆయన వివాహము చేసుకున్నారని ఆయన్ను నమ్ముకున్న మేమంతా దిగులుపడి అలిగాము. అయినా అమ్మగారు వచ్చాక అందరము ఆయనింటికి వెళ్ళాము. అమ్మగారు చాలా నిరాడంబరముగా వున్నారు. ఎంతో ప్రేమగా మాట్లాడారు. అందరికీ టీ ఇచ్చారు. అప్పుడు మాష్టారుగారు మాతో కూర్చుని టీ త్రాగుతూ "అమ్మా! మన మంతా ఒక ఇంట్లో వాళ్ళలా ఉందాము. ఇది మనందరి ఇల్లు. ఇందులో అందరికీ స్వతంత్ర ముంది, నేను అమ్మగారికి మీకు కూడా దగ్గరవాడినే చెంతకే వస్తారో, దూరమవుతారో అది మీ ఇష్టం అన్నారు". కారుణ్యమూర్తి ఆయన గాక

ఇలా ఎవరు చెప్పగలరు? ఆయనను ఏ వేళప్పుడైనా దర్శించుకోవచ్చు. ఆయన ఇంటికెప్పుడైనా వెళ్ళవచ్చు. జిజ్ఞాసులకు జ్ఞానమిచ్చే గురువు. ఆర్తులను ఆదుకునే కరుణామయుడు. ఎవరైనా ఆర్తితో ఆయన్ను ఏదైనా అడిగితే కాదు అని అనలేక పోయేవారు. కన్న తండ్రిలా కరిగి పోయేవారు. ఒక రోజు మాష్టారుగారు వారి ఇంట్లో హాల్లో కూర్చునివున్నారు. బయట ఎవరో ఒక భిక్షగాడు రామనామము రమ్య మైనది అంటూ పాటపాడుతున్నారు. అతను చలికి వణుకుతున్నాడు. పైన గుడ్డలేదు. గోచితో ఉన్నాడు. మాష్టారుగారు లేచి ఆయనకెవరో ప్రజంటేషన్‌గా కప్పిన శాలువ తీసి ఆతనిపై కప్పి బాబా దగ్గరున్న బిస్కెట్లు దోసిటి నిండా పోశారు. బాబా చరిత్ర కూడా ఇచ్చారు. అదేంటి మాష్టారు! చరిత్ర ఇస్తున్నారు. అతను చదువుతాడా అన్నాను. అతను చదివాడు. మతిచలించి ఇలా అయినాడు అన్నారు. మీకెలా తెలుసు? అని నేనడిగితే నవ్వి వూరుకున్నారు. అంటే ఆయనకు ప్రతి ఒక్కరి జీవితం తెలిసినట్లే కదా! ఆ శాలువా వెల 2000 రూపాయలట. హాలెండు నుంచి ఒకతను మాష్టారుగారికిచ్చారట.

వారింట్లో భక్తులే గాక కుక్కలు పిల్లులు యధేచ్ఛగా తిరుగుతుండేవి. ఒకరోజు మేము అంటే నేను, మా పిన్నమ్మ గారు నెల్లూరు పెళ్ళికి వెళ్ళి రాత్రి 9.30 కు విద్యానగర్ బస్ కొచ్చాము. మావూరికి బస్ లేదు. అప్పుడు మాష్టారుగారి పిన్నమ్మ లక్ష్మిగారు వచ్చి వున్నారు. (మాష్టారుగారికి పెళ్ళి కాలేదు) ఆరాత్రి అక్కడే పడుకున్నాము. మావురికి పొద్దున లేచి 6 గంటల బస్సుకు వెళదాము అనుకున్నాము. మాష్టారుగారి పిన్నమ్మగారు కూడా వుండమని బలవంతపెట్టారు. ఆ రాత్రి హోటల్ స్వామి ఇంట్లోంచి చపాతీలు తెప్పించారు, మాష్టారుగారు. మాష్టారుగారు, వారి పిన్నమ్మ, మేము అవే తిని పడుకున్నాము. రాత్రి సరిగా 12 గంటలకు ఇంటి వెలుపల ఒక కుక్క అరిచింది. ఇంట్లో రెండు కుక్కలు మాతో పడుకున్నాయి.



బయటకుక్కలు అరిచే సరికి ఇంట్లో పడుకున్న రెండు కుక్కలూ పెద్దగా అరవడం మొదలుపెట్టాయి. మాష్టారుగారి పిన్నమ్మగారు, నేను, మాపిన్నమ్మ ముగ్గురం లేచాము. మాష్టారు మాత్రం తలక్రింద సాయి చరిత్ర పెట్టుకుని హాయిగా గాఢంగా నిద్రపోతున్నారు. మేము 4 గంటల దాకా మేలుకొని వున్నాము. ఈ కుక్కలు తరిమినా బైటకెళ్ళ కుండా భరద్వాజ గారి చుట్టూ తిరుగుతూ అరుస్తూనేవున్నాయి. 41/2 కు ఆయన లేచి ఆవులిస్తు ఏంటిరా రాత్రంతా భజన చేస్తున్నారా? అంటున్నారు. నాకు ఏడవలేక నవ్వు వచ్చింది. ఆ తర్వాత వారి పిన్నమ్మగారితో "పిన్ని వాళ్ళు పూర్వజన్మలో భక్తులే. కాని అహంకారంతో కన్ను తెలియకుండా అందరినీతిట్టేవారు. అందుకనే కుక్క జన్మలెత్తి నా దగ్గర చేరారు. వీళ్ళకిక జన్మవుండదు అన్నారు" . ఆమె కళ్ళు నలుపుకుంటూ ఏమో బాబూ అన్నారు.

ఒక సారి మేము రాత్రి 9 గంటలకు శ్రీ భరద్వాజగారింటికి వెళ్ళాము. నాకు బాగా ఆకలి వేస్తోంది. మావూరికి వెళ్ళేందుకు అప్పుడు బస్ లేదు. ఇంటికి ఫోన్ చేసి వెహికల్ ఏదైనా పంపించమన్నాము. అదిపంపేలోగా మాష్టారింట్లో ఉన్నాము. వారు అమ్మా మీరు హోటల్ స్వామి ఇంట్లో భోజనంచేస్తారా? నేను కబురు చేస్తాను అన్నారు. కానీ నేను వాళ్ళ ఇంటికి వెళ్ళనన్నాను. మరి మాఇంట్లో తింటారా అన్నారు. సరేనన్నాము. వారు వాళ్ళకు వండుకున్న అన్నం అంతా, గోంగూర పచ్చడి వేసి కలిపారు. అదేకూర తప్ప ఇంకేమీలేదు. ముందు అమ్మకు ఆతర్వాత నాకు చెరొక ముద్ద పెట్టినారు, వారూ తిన్నారు. నేను తినలేక పోతున్నాను మాష్టారు అన్నాను. ఏమిటమ్మా ఉప్పగా ఉందా అన్నారు. అవునన్నాను. మళ్ళీ ఇంకో ముద్ద పెట్టారు. అది చాలారుచిగానూ తినాలనిపించేలా వుంది. ఇంతలో అంతమార్పెలా వచ్చిందని ఆశ్చర్యపోయాను. భావాతీతులు మాష్టారు.

ఒక సారి నేను మా ఇంట్లో గొడవలు ఆందోళన గురించి మాష్టారికి విన్నవించుకున్నాను. ఆయన "ఆహా! నీవెంత అదృష్టవంతురాలివమ్మా! నీ జన్మ జన్మల పాపం ఇలా మీ వాళ్ళు పరిహారం చేస్తుంటే వాళ్ళ నాలుకకు నీవు ప్రణామాలర్పించాలి అన్నారు. ఇప్పట్లో ఓర్పుచాలా మంచిది అన్నారు." నా మనసు చాలా శాంతించింది.

ఒక సారి మా పిన్నమ్మగారి అమ్మాయికి రాత్రికి పెళ్ళి అనగా ఆకాశం మేఘావృతమై వాన చిరుజల్లు పడుచున్నది. అపుడు మేము మాష్టారు దగ్గరకు వెళ్ళి విన్నవించగా ఎలాంటి భయము అవసరం లేదు. పెళ్ళి అయినంత వరకు వానరాదు నేనున్నానన్నారు. అట్లాగే పెళ్ళి అయినంత వరకు చినుకు రాలేదు. అందరూ నిద్రించాక కుండపోతగా వర్షం కురిసింది. అంటే శ్రీ మాష్టారికి పంచభూతములు స్వాధీనము. శ్రీ మాష్టారు సమాధికి 15 రోజుల ముందు నాకు స్వప్నంలో దర్శనమిచ్చి శీతారామయ్య ఇంట్లోంచి నేను వేరే ఇంటికి మారుతున్నానమ్మ అని చెప్పారు.

అవి విద్యానగర్ లో మందిర నిర్మాణం జరుగుతున్న రోజులు, మాష్టారి గారి మీద ప్రశంసలు, విమర్శలు చేసే, రెండు రకాల వారు ఉండేవారు. మాష్టారి మీద కోపంతో ఒక వ్యక్తి మాష్టారిని కొట్టడానికి వస్తున్నాడు. నేను (సూర్య ప్రకాశ రావుగారు) వారి ఎదురుగుండా కూర్చొని ఉన్నాను, మాష్టారి గారి కళ్ళు ఎర్రబడ్డాయి. వారు "అదిగో అతను వస్తున్నాడు కానీ అతను నన్నేం చేయగలడు, శరణు పొందుట తప్ప" అన్నారు. నిజంగానే ఒక వ్యక్తి కోపంతో వచ్చాడు, మాష్టారుగారిని చూస్తూనే అతని కాళ్ళు చల్ల బడ్డాయి. నీరసపడి మాష్టారి గారి కాళ్ళ మీద పడి భోరున ఏడ్చేసాడు. మాష్టారు నవ్వుతూ అన్ని సవ్యంగానే జరుగుతాయని అతని భుజం తట్టి విభూది పెట్టి ప్రసాదం ఇచ్చి పంపారు.



మాష్టారు సర్వప్రాణులనూ తనలోని అంశంగా బావించి, తన వ్యతిరేకుల శ్రేయస్సు కోరే మహానుభావుడు. ఆయన ప్రసాదించిన ఇలాంటి అనుభవాలు ఎన్నో, మరెన్నో.

జి . సూర్య ప్రకాశరావు గారు, విద్యానగర్.

శ్రీ మాష్టారుగారు తన ఐ.ఎ.ఎస్. పరీక్ష అనుభవాన్ని ఇలా వివరించారు. ఎంతో కేజువల్‌గా ఇంటర్‌వ్యూకి తయారయ్యాను. ఇంటర్‌వ్యూ జరుగుతున్నది. వారు మాష్టారుగారిని ప్రభుత్వం వారు చేపడుతున్న ఫేమిలి ప్లానింగు గురించి నీ అభిప్రాయం ఏమిటి? అని అడిగారు. దానికి వెంటనే మాష్టారుగారు ప్రభుత్వం చేపడుతున్న పథకాలలోని లోపాలను ఎత్తిచూపుతూ పాయింట్లు వారి ముందుంచారు. ఇంటర్‌వ్యూ అధికారులు మాష్టారిగారిని దీనికి పరిష్కారము ఏమిటి? అని అడిగారు. దానికి వెంటనే మాష్టారు ప్రభుత్వ పథకాలను ఎలా సరిచేసుకోవాలో ఒక్కొక్క పాయింట్ వివరించారు. దానికి ఇంటర్‌వ్యూ బోర్డ్ వారు మెచ్చుకుని మాష్టారుగారిని ఐ.ఎ.ఎస్. కు సెలక్టు చేసుకున్నారు. మా కాలేజీలో వచ్చే ఎన్నో సమస్యలకి మాష్టారుగారు పరిష్కార మార్గాలు చూపుతూ ఉండేవారు. భరద్వాజా! నీతో వాదించలేమయ్యా? అనే వారు చాలా మంది. వారి తర్కము, మానసిక విశ్లేషణ అమోఘము. అక్కడికక్కడే వారు పరిష్కార మార్గము సూచిస్తూ ఉండేవారు. ఈనాడు మనకు వారి భౌతిక దేహం కనిపించనప్పటికి వారిని మనసారా వేడితే మనందరి సమస్యలకు పరిష్కార మార్గము లభిస్తుందని నా విశ్వాసము.

జి. ప్రకాశరావు గారు, విద్యానగర్.

## సమాధి అవ్వకముందే భౌతికదేహంతో ఉండగా జరిగిన దివ్యానుభవములు - శ్రీమతి జె. సరోజనమ్మ:

ఒంగోలులో జె. సరోజనమ్మగారు ఒక రోజు ఇంటిలో పూజ చేసుకుంటున్నపుడు, కళ్ళ వెంబడి నీళ్ళు కారిపోతున్నాయి. అప్పుడు వారు "ఓహో నాకు ఆనంద భాష్పాలు వచ్చేస్తున్నాయి. నవ విధ భక్తులలో ఇది ఒకటి కదా! నాకు బాగా భక్తి పెరిగినట్లుంది. ఒకస్థితి కలిగింది" అని అనుకున్నారు. ఆరోజు రాత్రి కలలో శ్రీ మాష్టారు కనిపించి "అమ్మా! అవి కళ్ళ నుండి వచ్చే నీరుకావు. కళ్ళ జోడులో ఆవిరి కమ్మి నీళ్ళు కారుతున్నాయి గమనించండి." అని చెప్పారు మరుసటిరోజు గమనిస్తే అది వేసవికాలం కావడంతో, వేడికి అద్దానికి ఆవిరికమ్మి నీరు వస్తున్నది. ఈ దివ్యాను భవం ద్వారా శ్రీ మాష్టారు సర్వవ్యాపకులని, సర్వజ్ఞులని, విశ్వచైతన్యమే వారని మన ఆలోచనలు నిరంతరం తెలుసుకుంటూ మనలను సరియైన రీతిలో నడిపించగల సద్గురువులని వారి దివ్యస్థితిని భౌతిక దేహంతో ఉండగానే తెలియ చేసినారు. అంతటానిండిన చైతన్యం ఒక్కటే కదా! అదే శ్రీ మాష్టారు, శ్రీవెంకయ్యస్వామి, శ్రీసాయి బాబా రూపాలలో మనలను ఉద్ధరిస్తుంది.

ఒకసారి సంక్రాంతి సమయంలో, శ్రీ మాష్టారు భౌతికంగా ఉండగా తెప్ప ఉత్సవం జరిగింది. అన్ని ఆలయాల నుండి దేవుళ్ళను తీసుకు వచ్చి, తెప్పలలో పెట్టి మూడు సార్లు తిరుగుతారు. ఒక పడవలో బాబా పటాన్ని పెట్టి, శ్రీ మాష్టారిని కూర్చో బెట్టారు. జనం గట్ల నిండా క్రిక్కిరిసి నుంచొని ఉన్నారు. ఆ జనంలో నుండి మా తలలు మాత్రమే కనిపిస్తుంటాయి. శ్రీ మాష్టారు ఎక్కడో దూరంగా ఉన్నారు. మేము మాష్టారు మావైపు చూడాలని అక్కడినుండే నమస్కారం చేసుకున్నాము. వెంటనే మాష్టారు మావైపు చూస్తూ ప్రతి నమస్కారంగా, కుడి చేత్తో



హృదయాన్ని తాకారు. మేము ఎంతో ఆనందించాము. నిజానికి ఆజనంలో మాష్టారికి మేము నమస్కరించినట్లు కనిపించి ఉండదు. చేతులు హృదయం వద్ద జోడించే నమస్కారం చేసాము కానీ, చేతులు పైకెత్తి నమస్కరించలేదు.

శ్రీ మాష్టారు భౌతికంగా ఉండగానే, స్వప్నంలో చివటం అమ్మను చూపించి "ఈమేనమ్మా చివటం అమ్మ! నమస్కారం చేసుకో!" అని చూపించారు.

## మేడా రామచంద్రరావు గారి తల్లిగారు - ఒంగోలు వారి అనుభవం ఇలా చెబుతున్నారు:

శ్రీ మాష్టారిని ఒకసారి మా ఇంటికి రమ్మని అడిగినప్పుడు, తరువాత వస్తానని, చాలా రోజుల వరకూ రాలేదు. శ్రీ మాష్టారిని కలిసినప్పుడల్లా, తరచుగా వారు " నేను కొరవవున్నాను. (బాకీ) మీ ఇంటికి వస్తానన్నాను, రావాలమ్మా" అని అంటుండేవారు. శ్రీ మాష్టారు సమాధి చెందడానికి రెండువారాల ముందుగా మా ఇంటికి వచ్చారు. మా ఇంటి ప్రక్క నున్న శైలమ్మ, పాండు రంగారావు అనే దంపతులకు, ఒక పాప పుట్టిన తరువాత 10 సంవత్సరాల వరకూ పిల్లలు పుట్టలేదు. మాష్టారు మా యింటికి వచ్చినప్పుడు "మాష్టారికి ఇష్టమయిన హల్వా నేను తయారు చేసి మాష్టారికి పెడతానని ఆమె చేసిపెట్టింది. మాష్టారు దానిని స్వీకరించారు. ఆమె తన కోరిక అయిన బాబు పుట్టాలనే విషయం శ్రీ మాష్టారితో చెప్పగా మాష్టారు " తప్పక బాబు పుడతాడు అని చెప్పి", శ్రీగురు చరిత్ర పారాయణ చేయమన్నారు. సంవత్సరంలోగా బాబు పుట్టాడు. వారు ఆ బాబుకు "సాయి భరద్వాజ" అని పేరు పెట్టుకున్నారు.

## శ్రీమతి సుబ్బలక్షమ్మగారు, ఒంగోలు ఇలా చెపుతున్నారు:

1986-87 లో మావారికి నెల్లూరు ట్రాన్సఫర్ అయ్యింది. రోజూ ఉదయం 5 గంటల రైలులో వెళ్ళి మరలా రాత్రి 9 గంటలకు తిరిగి వచ్చేవారు. రోజూ 3 గంటలకే నిద్రలేవ వలసి వచ్చేది. ఇది ఇబ్బందిగా ఉండటంతో శ్రీమాష్టారితో నేను "సార్ మేము నెల్లూరులోనే కాపురం పెడతాము" అంటే, మాష్టారు "వద్దు, నీవు ఆయనను బాధపెడతావు. ఇప్పుడు ఆయన శారీరకంగా బాధపడటమే మంచిది. నువ్వు అక్కడకు వెళితే ఆయనను మెంటల్ గా తినేస్తావు" అన్నారు. "వారానికి ఒక్కరోజు మాత్రమే 6.45 గంటలకు రైలు ఉంది. ఆరైలు రోజూ ఉంటే బాగుండును సార్ అన్నాను". అప్పుడు మాష్టారు ఏమో, రేపటినుంచి ఆ టైముకి రోజూ ఉంటుందేమో! అన్నారు. ఆ మాట అన్న ఒక వారంలోపల రైళ్ళ షెడ్యూల్ మార్చారో లేక కొత్త రైలు వేసారో గానీ, ఆదివారం తప్పించి మిగతా అన్ని రోజులు 6.45 నిముషాలకు రైలు ఉండేది. వారి నోటినుండి క్యాజువల్‌గా వచ్చినట్లు అనిపించినా అవితప్పక జరుగుతాయని మా నమ్మకం.

## వి. రామకృష్ణ, సాయిబాబాగుడి, లాయరు పేట, ఒంగోలు:

ఒంగోలులో భీమా శ్రీనివాసరావు అనే అతను మాష్టారి వద్దకు వచ్చి శిరిడీ, పండరీపురం మొదలైన క్షేత్రాలకు టూరిష్టు బస్సు వేస్తానని అడగగా, మాష్టారు "నీకూ, బాబాకు లింకు లేదు (పడదు) శిరిడీ తప్పించి మిగిలిన ప్రదేశాలకు వేసుకో" అని చెప్పారట. అతడు మాష్టారి మాటను పట్టించుకోకుండా, యాత్రా స్థలాల పాంప్లేట్లలో షిరిడీ పేరు వేయించి ట్రిప్స్ వెయ్యడం మొదలు పెట్టాడు.



ఈ విషయం తెలియక, నేను మొదటి సారి శిరిడీ వెళ్ళేటప్పుడు అతని బస్సులోనే బయలు దేరాను. అప్పుడు మా బస్సులో ఒక బి.పి. పేషంట్ కూడా ఉన్నాడు. సరిఅయిన వేళకు భోజనాలు లేక అతడు ఆకస్మికంగా చనిపోయాడు. దానితో ట్రిప్‌ను మధ్యలోనే నిలిపివేసి, నేను మరికొంత మందితో కలిసి ఆ శవాన్ని వెనుకకు తీసుకు వచ్చాము. అతని బస్ పరిమిట్ సరిగా లేదు దారిలో ఎన్నో కష్టాలు పడుతూ ఆఖ రికి ఒంగోలు చేరుకున్నాము. జరిగిన ఈ విషయాలన్నీ నేను మాష్టారి దగ్గరకు వెళ్ళి చెప్పాను అప్పుడు నన్ను మాష్టారు " నువ్వు ఫలానా బస్‌లో వెళ్ళావా" అని అడిగి అప్పుడు వారు బస్సు అతనికి మొదట చెప్పిన విషయం చెప్పారు.

అప్పటికి ఆ బస్సు అతను శిరిడీ ట్రిప్స్ వేయడం మానలేదు. మరోసారి అదే బస్సుకి నాగార్జున సాగర్ డామ్ వద్ద ప్రమాద పరిస్థితి ఎదురై తప్పింది. ఆ తరువాత కొన్నాళ్ళకు అతను శిరిడీ ట్రిప్స్ వేయడం మానేసాడు.

# శుద్ధ చైతన్యమే తానైన పూజ్య శ్రీ భరద్వాజ గారు

## మాష్టారి సమాధి అనంతర లీలలు

శ్రీమతి మంజుల చంద్రశేఖర్ - ఎమ్. ఆర్. పల్లె, తిరుపతి. ఇలా వ్రాస్తున్నారు - మా తండ్రిగారి బలవంతంపై వారపత్రికలు నవలలు చదవడం మానేసి "మరోనందదీపం" చదివేదాన్ని. శ్రీ మాష్టారి మీద గొప్ప అభిమానం కలిగి గురు చరిత్ర లాగా మరోనందదీపాన్ని చదివేదాన్ని. శ్రీమష్టారు మహాసమాధి అనంతరం కూడా మన ప్రార్ధనలతో నిమిత్తం లేకుండానే మనలనెలా రక్షిస్తున్నారో తెలిపేదే నా అనుభవం.

మా పెద్దబ్బాయిని నేను మెడిసన్ చదివించాలనుకున్నాను. ఇంటర్లో బై.పి.సి. చెప్పించాను. మూడు సార్లు వ్రాసినా సీటురాలేదు. ఇంటర్ లో ఎం.పి.సి. అయి ఉంటే వాడికి సీటు వచ్చి ఉండేది. బై.పి.సి. చేర్పించడం నా తప్పు అని తీరని మనస్తాపానికి గురియైనాను. ఆచింతలో పిచ్చి దానిలా తయారయ్యాను. ఏంగ్జయిటీ న్యూరాలసిస్ అని డాక్టర్లు ఎన్నో మందులు వాడినా తగ్గలేదు.

ఒక గురువారం రాత్రి నా స్వప్నంలో మాష్టారుగారు అమ్మగారు కనిపించి, మీ ఇంటికి భోజనానికి వచ్చామని చెప్పారు. సంతోషంగా భోజనము పెట్టాను. భోజనానంతరం నాతో మాష్టారు చెపుతున్నారు- నీవు 'మరో నందదీపం' బాగా చదివావుగదా. "నేను ఇంటర్లో బై.పి.సి లో కావాలని ఒక పేపరు పోగొట్టుకున్నాను. అయినా ఐ.ఎ.ఎస్. అయ్యాను, వీళ్ళిద్దరూ నీ పిల్లలు కాదు. సాయినాధుని పిల్లలు. వీళ్ళను గురించి నీవేమీ ఆలోచించవద్దు. అన్నీ మేము చూచుకుంటాము. పిల్లల్ని గురించి



దిగులు వద్దు. అంతా మరచిపో నీవెప్పుడూ సంతోషంగా ఉంటూ తండ్రికి తగ్గ బిడ్డవనిపించుకో" ఈ మాట చెప్పడానికే వచ్చాము, అని లేచారు. నా పిల్లలు నేను పాదాభివందనం చేస్తుంటే ఒక అరగంట సేపు అశీర్వదించారు. వెంటనే నాకు మెలకువ వచ్చింది. తెల్లవారి నుండి నా రోగం ఏమైందో తెలియదు. నేను మామూలు మనిషినయ్యాను. నా పిల్లలిద్దరూ మంచి ఉద్యోగాలు చేస్తూ జీవితంలో స్థిరపడి ఆనందంగా ఉన్నారు.

## మాచెర్ల నుండి జి. మహాలక్ష్మి గారు తనకు శ్రీ మాష్టారుగారు భౌతిక దర్శనమిచ్చిన విషయం ఇలా వ్రాస్తున్నారు.

2003 సం|| జూన్ 9 నుండి 14 వ తేది వరకు జ్వరం, గుండె నొప్పి, కడుపులో మంట - పూర్తిగా మంచంలో నుండి లేవ లేకున్నాను ఆ బాధాకరమైన పరిస్థితిలో పూజ్య గురు దేవులు శ్రీ భరద్వాజ మాష్టారుగారు 10-7-2003 న మధ్యాహ్నం 12 గంటలకు భౌతిక దర్శనం ప్రసాదించి జులై 14 తేది వరకు ఓర్చుకోమన్నారు. ఇది స్వప్నం కాదు. ప్రత్యక్ష భౌతిక దర్శనంతో ఇచ్చిన సందేశము. 12-7-03 న నా పరిస్థితి చాలా ఆందోళన కరంగా ఉండడంచేత నా కొమారుడు నన్ను హాస్పిటల్‌లో చేర్చాలన్నాడు. నా గురు వాక్యం నాకు ముఖ్యం గనుక నాగురువు గారు 14 తేది అని చెప్పారు, 14వ తేది వరకు చూచి తర్వాత నీ ఇష్టమొచ్చినట్లు చేసుకోమన్నాను. మూఢ నమ్మకాలతో ఏదో మాటలు నమ్మి రోగం ముదరబెట్టుకోమని కేకలువేసి వెళ్ళాడు. 13-7-2003 రాత్రి శ్రీ బాబాగారు శ్రీ మాష్టారుగారు స్వప్న దర్శనమిచ్చారు. 14వ తేది ఉదయం ఆరోగ్యం చక్క బడి లేచి గురుపాద నమస్కారం చేసుకున్నాను. ఇంతటి గొప్ప అనుభవం చూస్తూకూడా మా వాళ్ళు మారలేదంటే వాళ్ళ ప్రాప్తం అలా ఉంది.

## పి. మాధవి, జి. కొండలరాయుడు, ఎమ్.ఇ.ఓ., ఇంటి. నెంబర్: 7-5-81, ఎమ్.ఎమ్. డొంక, ఒంగోలు:

1½ సంవత్సరాల నుండి ప్రతిరోజూ మాష్టారి ఇంటికి వెళ్ళి, పటాలకు, విగ్రహానికీ, పూలు పెట్టి లీలామృతం సప్తాహ పారాయణ చేసుకుంటూ ఉంటాను. ప్రతి గురువారం సత్సంగానికి హాజరు అవుతూ, మాష్టారి సమాధికి 108 ప్రదక్షణలు చేసి ఉపవాసం ఉంటాను. వివాహం కావాలని అమ్మగార్ని (భరద్వాజ మాష్టారి శ్రీమతి గార్ని) అడిగితే వారు పై విధంగా చెప్పారు. మా ఇంటి దగ్గరలో ఒక పుట్ట ఉంది. దానికి పాలు పోయడంలేదే అని తరచు అనుకుంటూ ఉండేదాన్ని. ఒక రోజు స్వప్నంలో మాష్టారి విగ్రహం పాము రూపంలో ఉన్నట్లు దర్శనమైంది. దీని ద్వారా, మాష్టారికి రోజూ సమర్పించే పూలు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కూడా చెందుతున్నట్లు తెలిసింది. "నాకు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికీ భేదం లేదు" అని తెలిపినట్లు అనిపించింది. సకల దేవతా స్వరూపి శ్రీ మాష్టారు.

ఒక రోజు స్వప్నంలో ఒక విగ్రహానికి సగం మాష్టారు, సగం బాబా ఉన్నట్లు (శివ పార్వతుల వలె) దర్శనమైంది. ఇది పై నియమాలు పాటిస్తుండగా వచ్చిన కల. ఇప్పుడు వివాహం అయి సుఖంగా ఉన్నాను.

## వై. పద్మావతి, కోవూరు, విడువలూరు మండలం, నెల్లూరు జిల్లా:

నేను స్కూల్‌లో టీచరుగా పని చేస్తున్నాను. చాలా సంవత్సరాల నుండి బాబాను కొలుస్తున్నాను - సాయి లీలామృతం అప్పుడప్పుడూ చదివే దానిని. కానీ మాష్టారిగురించి ఏమి తెలియదు.



ఫిబ్రవరి - 2004 లో సాయి మాష్టార్ సమ్మేళనానికి, మా మిత్రుల ప్రోద్బలంతో వెళ్ళాను. అప్పట్లో విపరీతమైన ఆర్ధిక ఇబ్బందులతో సతమతమవుతున్నాను. అప్పుడు మిత్రులు మాష్టారికి నీ సమస్యలు నివేదించుకో, అని చెప్పి మాష్టారి పటం ఇచ్చారు. మాష్టారికి నా సమస్య నివేదించుకున్నాను. అనుకోని విధంగా నా ఆర్ధిక పరిస్థితి మెరుగు అవ్వటంతో నాకు వారిపట్ల విశ్వాసం ఏర్పడింది.

ఇలా ఉండగా, నా తమ్ముడు, వై సుబ్రహ్మణ్యం బాగా తాగటం వల్ల, ఆగష్టు - 2 వ తేది నుండి బాగా కక్కడం మొదలు పెట్టాడు. బాగా త్రాగటం వల్ల (ప్రేగు పొక్కి, చిల్లిపడి, బ్లెడ్ పోయి) జ్వరము, కాళ్ళూ చేతులూ వణుకు వచ్చి కళ్ళు తిరగడం మొదలు పెట్టాయి. గం. 6-30 నిమిషాలకు హాస్పిటల్ కు తీసుకువెళ్ళాము. బి.పి. బాగా ఎక్కను తగ్గనుగా ఉంది. కొన్ని సంవత్సరాల క్రిందట ఇలాగే త్రాగడం వల్ల, కాళ్ళు నొప్పులు రావడం, నెగిటివ్ జాండీస్ రావడం వల్ల డాక్టర్ "ఇతను రేపటి వరకూ కూడా బ్రతకడం కష్టం. బంధువులను పిలిపించుకోండి" అన్నారు. మన లోకంలో లేకుండా పిచ్చి, పిచ్చిగా మాట్లాడుతున్నాడు. మేము బాబాను ప్రార్థించాము. కొద్దిసేపటికి ఒకేసారి పెద్దవాంతి అయి, చమటలు కారి తగ్గింది.

ఇప్పుడు మరలా త్రాగి హాస్పిటల్‌కు చేర్చడం జరిగింది. నేను స్కూల్‌కు వెళ్ళి లీవ్ లెటర్ ఇచ్చి వచ్చి తమ్మునితో "నీ ఆరోగ్యం బాగుపడితే విద్యానగర్ వస్తానని మ్రొక్కుకో" అని చెప్పాను. అలాగే మ్రొక్కుకున్నాడు. మధ్యాహ్నాని కల్లా ఆరోగ్యం చక్కబడి ఇంటికి పంపివేశారు. మ్రొక్కు ప్రకారం అక్టోబర్ లో విద్యానగర్ వెళ్ళి వచ్చాము. విద్యానగర్ వెళ్ళి వచ్చిన 15 రోజుల వరకూ త్రాగలేదు. తరువాత త్రాగుతున్నా, అంతకు ముందు త్రాగుతున్నంత కాదు.

## శ్రీమతి జె. సరోజనమ్మ, ఒంగోలు ఇలా వివరిస్తున్నారు:

అమ్మగారు ఇంకా హైదరాబాదు వెళతారని తెలియక ముందు స్వప్నంలో మాష్టారు కనిపించి "అమ్మగారు అంటే ఎవరనుకున్నావు? వరలక్ష్మీ దేవి. ఆమెను వదలవద్దు" అన్నారు. కానీ కొద్ది రోజులలోనే అమ్మగారు హైదరాబాదు వెళ్ళిపోయారు.

ఒకప్పుడు నాకు బాగా నడుము నెప్పులు వచ్చాయి. నడవ లేక పోతున్నాను. మా అబ్బాయి పెండ్లి కుదిరింది. నేను గురువారం మాష్టారి ఇంటికి సత్సంగానికి వెళ్ళినపుడు భాదతో పై విషయం మాష్టారి పటానికి చెప్పుకున్నాను. ఆ రోజు రాత్రి మాష్టారు స్వప్నంలో పెద్ద విభూది పొట్లం తెచ్చి " అమ్మా షిరిడీ నుంచి వచ్చింది నీటిలో వేసుకొని త్రాగు" అన్నారు. అలానే అన్నాను. ఏమందూ వాడకనే తెల్లవారి లేచి చాలా ఉత్సాహంగా నడవ గలిగాను. ఏ ఇబ్బంది లేదు.

ఒక రోజు మా ఆర్థిక పరిస్థితి గురించి, ఇల్లు అమ్మకం గురించి చాలా మానసికమైన ఆందోళనలో ఉన్నాను. మా అబ్బాయి ఆరోజే ఇల్లు అమ్మకం నిమిత్తమై నెల్లూరు వెళ్ళాడు. "నా స్వప్నంలో ఎందుకమ్మా బాధ పడతావు. నేనున్నాను కదా!" అనే మాట వినిపించింది. వెంటనే మెళుకవ వచ్చింది. మానసికమైన ఆందోళన అంతా పోయింది. ఆవిధంగా ఆయన ఎప్పుడూ మాతో కూడా ఉంటున్నట్లు, అన్నీ చూస్తున్నట్లు అనుభవాలు ఇస్తున్నారు.

1991 లో మాల పిచ్చమ్మ తల్లిని స్వప్నంలో చూపించారు. నేను భౌతికంగా ఆమెను చూడలేదు. స్వప్నంలో తెల్ల చీర కట్టుకొని నల్లగా ఉన్నారు. నేను వెళ్ళగానే నన్ను ఆమె కౌగిలించుకొని ముద్దు



పెట్టుకున్నారు. తరువాత ఆమె మూత్రం విసర్జించారు. మాష్టారు నన్ను త్రాగేయమన్నారు. చేతిలో కొంచెం తీసుకొని త్రాగాను. కానీ మూత్రం అన్న భావం వల్ల నోరు అసహ్యంగా ఉండి వికారం అనిపించింది. ఇంతలో అమ్మ నోటిలో నుండి నీరు వచ్చాయి. మాష్టారు త్రాగమన్నారు. నీరు పుక్కిలించి ఉమ్మేసి అవి త్రాగేసాను. ఈ విధంగా మాష్టారు మహా సమాది అనంతరం కూడా మాతో ఉండి నడిపిస్తున్నారు.

## ఎస్. సునీత, s/o ఎస్. వెంకటస్వామి, లాయరు పేట, ఒంగోలు:

నాకు మాష్టారిని గురించి తెలియని రోజులవి. డిగ్రీ చదువు చున్నాను. గుడికి నా సబ్జక్ట్ చదువుకోవడానికి వచ్చి, చదువుకుని వెళ్ళే దానిని. కానీ మాష్టారి సమాధి వద్దకు వచ్చే దానిని కాదు. క్రమంగా కొన్నాళ్ళ తరువాత సమాధి వద్దకు వెళ్ళి కూర్చునే దానిని. అక్కడ వాళ్ళు సమాధిని పూలతో అలంకరించడం, శుభ్రం చేయడం చూచి నేను కూడా మొదలు పెట్టాను. కానీ మాష్టారు మహనీయులు అని తెలియదు. అంతకు ముందు కొన్ని సంవత్సరాల నుండి సూరజ్ అనే ఆమె మాష్టారి సమాధిని అలంకరించడం, శుభ్రం చేయడం చేసేది. ఆమెకు వివాహం అయినప్పటినుండి ఆమె రావడం లేదు. అప్పటి నుండి ప్రతిరోజు రెగ్యులర్‌గా మాష్టారి సమాధి వద్ద సేవ చేయడం అలవాటయింది. అది మొదలు మాష్టారు నా జీవితంలో చక్కని మార్పు తీసుకు వచ్చారు. ఎన్నో అనుభవాలు ప్రసాదించి నా లైఫ్ లో చాలా మార్పు తెచ్చారు. మాష్టారి అంతటి మహనీయులు ఇక రారు అనిపిస్తోంది. ఎ టు జెడ్, ప్రతి చిన్న విషయంలో తన బిడ్డకు ఇచ్చినట్లు జీవితంలో ఎంతో చక్కని ట్రైనింగ్ ఇస్తారు.

ఇంతకు ముందు ఏ పని చేసినా సరే సరిగా చేయలేకపోయే దానిని. ఎక్కడో అక్కడ తేడా వచ్చేది. ఇలా జరుగుతోంది ఏమిటి? అనిపించేది. కాని మాష్టారి దగ్గరకు వచ్చాక, అన్నీ చక్కగా జరుగుతున్నాయి. నే చేసే ప్రతి పని ఆయన దగ్గరుండి చేయిస్తున్నారని నా నమ్మకం.

డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్షలపుడు మొదట కొన్ని పరీక్షలు బాగానే వ్రాసాను. కానీ చివరి పరీక్షలు భయం, టెంక్షన్ వల్ల వ్రాయలేక పోయాను. అసలు పాసవుతానా అని భయం వేసింది. అపుడు మాష్టారి గురించి అంతగా తలియదు.

రెండవ సంవత్సరం పరీక్షల సమయానికి మాష్టారి సమాధికి సేవ చేయడం అలవాటు అయ్యింది. ఈ పరీక్షలు కూడా అలాగే టెన్షన్ వచ్చి వ్రాయలేకపోతానేమో అనుకున్నాను. కాని మాష్టారి దయవల్ల ఆయన ఉన్నారన్న నమ్మకం వల్ల, ఏమి భయం లేకుండా పరీక్షలు అన్నీ వ్రాయడం, మంచి మార్కులు రావడం జరిగింది. నేను నా స్టడీస్ అన్నీ మాష్టారి సమాధి వద్దనే కూర్చొని చదువుకుంటాను. డౌట్స్ అన్నీ వాటికవే క్లార్ పై అయిపోతుంటాయి. ప్రతి చిన్న విషయంలోనూ ఆయన నాతో ఉండి నడిపిస్తున్నారు అన్న ధృడ విశ్వాసం కల్గించారు.

ఒక రోజు స్వప్నంలో తిరుపతి వెంకటేశ్వర స్వామి విగ్రహం కనబడింది. కానీ దానిని అక్కడి వారందరూ మాష్టారు అని పిలుస్తున్నారు. అక్కడ మాష్టారి తల్లిగారు, ద్వారక ఉన్నారు. వారే అభిషేకం చేసి అలంకరిస్తున్నారు.



మాష్టారి సమాధి మందిరంలో ఒక పెద్ద మాష్టారి పటం ఉంది. ఒక సారి దానిని చూచి, " మాష్టారు ఇక్కడ భౌతికంగా కూర్చుని ఉంటే ఎంత బాగుంటుంది" అనుకున్నాను. ఆ రాత్రి స్వప్నంలో ఆ పటంలో కాక గుడిలో దత్తాత్రేయ స్వామి విగ్రహం ఉన్న చోట మాష్టారు ఉన్నట్లు చేతులు, కాళ్ళు కదుపుతున్నట్లు దర్శనమిచ్చారు.

## కృష్ణవేణి, దామోదర్ స్కూలు దగ్గర, లాయర్ పేట, ఒంగోలు:

మాష్టారు గారు భౌతికంగా ఉన్నపుడు, వారి చేత్తో సాయిలీలామృతం ఫస్ట్ ఎడిషన్ ఇచ్చి చదువుకోమన్నారు. అప్పటి నుండి అదే చదువుచున్నాను. ఒక సంవత్సరం క్రితం అమ్మగారు ఇప్పటి సాయి లీలామృతం చదవమనటంతో అదే చదవడం ప్రారంభించాను. ఒకరోజు మాష్టారు స్వప్నంలో కనిపించి "ఈ పుస్తకం కాదమ్మా నేను నీకు ఇచ్చిన పుస్తకం (మొదటి ఎడిషన్) చదువవమ్మా" అన్నారు.

ఒకరోజు మధ్యాహ్నం, ఎవరో మాష్టారి పటం వద్ద పెద్ద దానిమ్మ పండు పెట్టి ఉండటం చూచాను. నేను సాయంత్రం సత్సంగంలో పెడతారులే అనుకున్నాను. కానీ దానిని సత్సంగానికి ముందే ఎవరికో ఇచ్చేశారు. అయ్యో! అది అయిపోయిందే అని బాధ పడ్డాను. ఆరోజు రాత్రి స్వప్నంలో మాష్టారు కనిపించి, సత్సంగ సభ్యురాలు సరోజనమ్మగారిని చూపిస్తూ, సరోజనమ్మగారూ! కృష్ణవేణి గారికి 100 రూపాయలతో ప్రసాదం తెప్పించి పెట్టండి అన్నారు.

మేము ప్రతీ వారం జరిగే పూలంగి సేవలకు, ప్రసాదాలకు, అమ్మగారికి, పిల్లలకు అకేషన్స్‌లో బట్టలు పెట్టడానికీ విజయ దశమి, గురుపూర్ణిమ మొదలగు వాటికి మా సత్సంగ సభ్యులము అందరం

(సుమారు 20 మంది) డబ్బులు వేసుకొని చేస్తుంటాము. ఒక నెలలో ఇలాంటి సందర్భాలు ఎక్కువగా రావడం వలన, ఆ నెలలో ఒక్కొక్కరు పెద్ద మొత్తం (సుమారు రూ.1,500/- ) పెట్టుకోవలసి రావడంతో నేను మనస్సులో " అమ్మో అంత అయితే నేను ఇవ్వలేను మాష్టారూ!" అని అనుకున్నాను. ఆ రోజు రాత్రి మాష్టారు స్వప్నం లో ఇలా అన్నారు. " నేను నీ దగ్గర నుండి ఊరికే తీసుకోవడం లేదు. దక్షణ రూపంలో తీసుకుంటున్నాను. నీవు పారాయణ చేయగానే ఉపయోగమేముంది? దక్షణ ఎప్పుడు పెట్టావు" అన్నారు.

## పి.వి ప్రభాకర రావు, ఇంటి నెంబర్ 37-1-4/117/3 , సెకండ్ లైన్ అన్నవరప్పాడు, పోష్టాఫీసు దగ్గర, ఒంగోలు:

నేను 12 సంవత్సరాల క్రితం రోజూ ప్రణవం చేస్తూ ఉండేవాడిని. కొన్నాళ్ళు దానిని బాగా సాధన చేసి, లలితా అమ్మవారి దీక్ష తీసుకోవాలని ఒంగోలులో ఒకని వద్దకు వెళ్ళాను. అతను దీక్ష ఇస్తానని, రెండు సార్లు తేది నిర్ణయించి ఏదో ఒక ఆటంకం రావడంతో విఫలుడయ్యాడు. అతనికి మొదటి సారి జ్వరం వచ్చి పడిపోవడం, రెండవ సారి విరోచనాలు కావడం జరిగింది. దానితో అతను నాకు ఎలాగూ దీక్ష ఇవ్వలేక పోయాడు కాబట్టి నాకు కీడు చేయాలని నాపై మంత్ర ప్రయోగం చేసాడు. (ఇంతకు ముందు కొందరికి అతడు మంత్ర ప్రయోగం చేసినట్లు, వారికి కీడు జరిగినట్లు తెలిసింది) అందువల్ల ఎన్నో విధాలుగా తయారయ్యింది. ప్రతీరోజూ రాత్రి ఐదారు కుక్కలు ఇంటి పైకెక్కి దారుణంగా తెల్లవారేదాకా ఏడుస్తూ ఉండేవి. ఎన్ని మార్లు తరిమినా మరలా ఇంటి పై కెక్కి అట్లానే ఏడుస్తూ ఉండేవి. ఆఫీసుకు వెళితే పై అధికారులు, నా తప్పు లేకుండానే ఫైలు విసిరికొట్టడం, తిట్టడం జరిగేది. ఇలా విపరితమైన మానసిక అశాంతికి గురి అయ్యే వాడిని.



ఒక మంత్రగాడిని మా ఇంటికి తీసుకు వస్తే, కొద్ది సేపు కూర్చుని, అతను "నీ పై మంత్ర ప్రయోగం జరిగింది అది తీసి వేయడం నా వల్ల కాదు నేనేం చెయ్యలేను" అని చెప్పాడు. ఒక రోజు కలలో నాకు "నీ పిల్లలు నీకు లేకుండా పోతారు" అని నా మనసుకు సూచన ఇస్తున్నట్లుంది. మెలుకువ వచ్చేసరికి ఒక మెరుపు వెళ్ళి పోవడం కనిపిస్తోంది. అసలు ఆ పరిస్దితి నుండి బయట పడటం ఎలాగో తెలిసేది కాదు.

ఇలా రెండు మూడు నెలలు బాధ పడ్డాను. మా నాన్నగారు మాష్టారి సమాధి వద్దకు తీసుకు వెళ్ళి " ఇతని భాద్యత అంతా మీరే చూచుకోవాలి. ఇతనిని మీకు అప్పగిస్తున్నాను" అని మాష్టారికి చెప్పుకున్నారు. అప్పటి నుండి మాష్టారి సమాధికి 108 ప్రదక్షణలు, పారాయణ చేసేవాడిని. ఒక నెల రోజులలో పరిస్థితులన్నీ మారిపోయాయి. మాష్టారు రెండు సార్లు స్వప్న దర్శనమిచ్చారు. ఆఫీసులో వాతావరణం ప్రశాంతంగా మారిపోయింది. నేను కంప్లైంట్ ఇవ్వకుండానే, మునిసిపాలిటీ వాళ్ళు బజారులోని కుక్కల నన్నింటినీ తీసుకు పోయారు. ఇంటి పై కుక్కలు ఎక్కి అరవడం ఇక మరలా లేదు.

ఇప్పుడు నాకు మాష్టారే మొదటి ప్రిఫరెన్స్, తరువాతే తక్కిన ప్రపంచం. ఎప్పుడు గురు చరిత్ర పారాయణ చేసినా, పులగం మాత్రమే తిని, గురు చరిత్ర లో చెప్పిన నియమాలన్నీ పాటిస్తూ పారాయణ చేస్తుంటాను.

## సామా వెంకట స్వామి, లాయరు పేట, జమ్మి చెట్టు దగ్గర, ఒంగోలు:

నేను ఒంగోలులో కుమార్ మోటర్స్ డీలర్‌షిప్ గురించి ప్రయత్నించాను, కాని ఇంకా చాలా మంది పోటీగా ప్రయత్నిస్తున్నారు.

నిజానికి అంత మందిలో నాకు డీలర్‌షిప్ వస్తుందని నమ్మకం లేదు. కారణం వారిలో నాకన్న ఎక్కువ వ్యాపారంలో అనుభవజ్ఞులు ఉండటం. నేను మాష్టారి సమాధికి నమస్కరించుకొని, మీరు ఎలాగైనా నాకు డీలర్‌షిప్ ఇప్పించాలని ధునిలో టెంకాయ వేశాను. చాలా చిత్రంగా నాకే డీలర్‌షిప్ ఇప్పించారు. ఈ విధంగా మాష్టారు నా జీవనోపాధి వృద్ధి పొందించి, ఆర్థికంగా ఏ ఇబ్బంది లేకుండా చేసి వారి సేవ చేసుకొనే అవకాశం కల్పించారు.

కొన్నాళ్ళ తర్వాత, నా డీలర్‌షిప్ మరొకరికి ఇప్పించాలని, పెద్ద పెద్ద రాజకీయ నాయకుల చేత ఆ కంపనీ ఎమ్.డి. పై ఒత్తిడి తెచ్చారు. ఆ ఎమ్.డి. నాకు ఫోను చేసి, విషయం చెప్పి, "ఇంక నేనేమీ చేయలేను" అన్నారు. నేను "సరే మీ ఇష్టం అన్నాను. మీకు ఎలా అని పిస్తే అలాగే చెయ్యండి" అని, నేను నేరుగా మందిరానికి వెళ్ళి, మాష్టారికి చెప్పుకొని గుండంలో టెంకాయ వేసి, "ఇది నాకు చాలా క్లిష్టమైన సమస్య, మీరు ఏం చేస్తారో నాకు తెలియదు. ఈ సమస్యకు మీరే పరిష్కారము చెయాలి, నేను ఏ రాజకీయ నాయకుల ద్వారా కానీ, మరొకరి ద్వారా కానీ సమస్య పరిష్కారమునకు ప్రయత్నించను" అని చెప్పి వచ్చేసాను. ఎంతో ఆశ్చర్యకరంగా ఏ విధంగా వ్యక్తుల మనస్సులు, పరిస్థితులు మార్చారో గాని, నా సమస్య పరిష్కారించారు. ఇది కేవలం సాయి మాష్టార్ కృప వల్లనే జరిగింది. అందుకు నేను వారికెంతో ఋణగ్రస్తుడను.

## సుబ్బలక్ష్మమ్మగారు, ఒంగోలు ఇలా చెబుతున్నారు:

కొన్నాళ్ళకు ముందు మా బాబు ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి రాజస్తాన్ వెళ్ళాడు. తెల్లవారితే ఇంటర్వ్యూ అనగా మాష్టారు నాకు స్వప్న దర్శనమిచ్చారు. స్వప్నంలో మాష్టారు మా ఇంటికి వచ్చి ముందు గదిలో



కూర్చొని ఉన్నారు. నన్ను చూసి "అమ్మా నువ్వు నాకు బాకీ ఉన్నావు" అన్నారు. అవును సార్! పుస్తకంలో రాసుకున్నాను, అని చెప్పి లోపలికి వెళ్ళి పుస్తకంతో తిరిగి వచ్చేటప్పటికి మాష్టారు కనిపించలేదు. తెల్లవారి ఆలోచిస్తే, మా బాబుకి ఉద్యోగంవస్తె నేను మాష్టారికి బాకీ పడతాను. కనుక నాకు తోచింది మాష్టారుగారికి కృతజ్ఞతతో సమర్పించాలి అనుకున్నాను. తర్వాత వాడు ఇంటర్వ్యూలో సెలక్ట్ ఆయి ఉద్యోగం వచ్చిందని తెలిసింది. అలా ముందుగానే, నిజానికి వాడి ప్రారబ్ధంలో లేకపోయినా, ఉద్యోగం మాష్టారే ఇప్పించారని తెలియజేసారు.

ఒక రోజు స్వప్నంలో మాషారు గారి గొంతు వినిపించింది. ఒక మంత్రం చెప్పి, దానిని జపిస్తూ ధుని చుట్టూ ప్రదక్షణలు చేయమని బాబా గుడిలోని ధుని చూపించారు. మేళుకువ వచ్చాక కూడా మంత్రం స్పష్టంగా గుర్తుంది. ఇంట్లో వారితో చెప్తితే సరే అన్నారు. తరువాత మేము హైదరాబాదు వెళ్ళాము. మా చిన్న బాబు బలవంతం పై మేము ఒక జ్యోతిష్కుని వద్దకు వెళ్ళాము. అతను నా చేయి చూచి " నీకు చెప్పాల్సింది ఏది లేదమ్మా అంతా నీ గురువు ఇష్ట ప్రకారం జరుగుతుంది, కాని నీ రేఖలను బట్టి ఏమీ జరగదు. మీగురువే దీనిలో కనిపిస్తున్నారు. ఆయన ఎలా నడిపిస్తే అలా జరగాల్సిందే. ఏ సమయానికి ఏం చెయ్యాలో ఆయనే చేస్తారు" అన్నారు.

## నెల్లూరు టౌను, నవాబుపేట, ఎనమల పాళెం కాపరస్థురాలు పసుపు లేటి ఆదిలక్ష్మమ్మ యిలా వివరిస్తున్నారు:

1998 సంవత్సరం అక్టోబరు 29 న నేను, నా కుమార్తె, మనవరాలు మరియు మాకుమారుడు నలుగురము మాపిన్నమ్మను చూచుటకు ఒంగోలు వెళ్ళుచున్నాము, నెల్లూరు రైల్వే స్టేషన్‌లో కూర్చుని

వుండగా రైలు వచ్చే వ్యవధిలో ఒక ఆయన గడ్డము, తెల్ల చొక్క, తెల్లపంచె, భుజముకు ఒక జోలి ధరించి మా వద్దకు వచ్చి అమ్మా! మీరు ఎచ్చటకు వెళ్ళుచున్నారు? అని అడిగినారు. నేను స్వామి మేము ఒంగోలులోని మా బంధువులింటికి పోతున్నాము అని చెప్పినాను. వారు మీరు ఒంగోలుకు పోతున్నారు కదా మీరు పోయిన వెంటనే మరచి పోకుండా తప్పక అచట భరద్వాజ ఆశ్రమమున్నది, తప్పక దర్శించండి అని అన్నారు. అచ్చట అంతా మా వాళ్ళే ఉంటారు, గౌరవంగా, మర్యాదగా మిమ్ములను చూస్తారు, తప్పకుండా పోండి అని చెప్పి తన జోలి నుండి చిన్నవి గుండ్రటి చక్కెర గుళ్ళు మా నలుగురికి ఇచ్చారు. నేను, మాకుమార్తె, మనువరాలు తిన్నాము, మా అబ్బాయి మాత్రము ఎవరు పెట్టిందల్లా తినకూడదు, మోసముచేస్తారు అన్నాడు. రైలువచ్చింది, మేము ఒంగోలు చేరి, మా బంధువులింటికి వెళ్ళాక, వారితో భరద్వాజ ఆశ్రమమును గురించి అడిగినాను. మా పిన్నమ్మ నేను నిత్యము సాయిబాబా మందిరమునకు పోతుంటాను, అచ్చటకు దగ్గరలో భరద్వాజాశ్రమము ఉన్నది, అచ్చటకు తీసుకువెళతాను అని మమ్మలను మాపిన్నమ్మ శ్రీ భరద్వాజ మాస్టారిగారింటికి తీసుకువెళ్ళింది. అచ్చటకు వెళ్ళగానే అచ్చట ఉన్న పాలరాతి విగ్రహము చూచి నేను ఆశ్చర్యపోయాను. నేను మా పిన్నమ్మతో నాకు నెల్లూరు రైల్వే స్టేషన్‌లో కనిపించి ఇచ్చటకు వెళ్ళమని చెప్పిన వారు (స్వామి) ఇట్లాగే ఉన్నారు అన్నాను. నాకసలు అంతవరకు శ్రీ భరద్వాజమాస్టారుగారెవరో తెలియదు, పరిచయమేలేదు. ఆరోజు శ్రీ మాస్టారుపుట్టిన రోజట (30వ తేది). లోపల అమ్మగారిని సింహాసనము పై కూర్చోబెట్టి అందరూ అమ్మగార్కి నమస్కరించి ఆశీస్సులు తీసుకుంటున్నారు. నేను నాకు శ్రీ మాస్టారిచ్చిన దివ్యానుభవము శ్రీ అమ్మగార్కి చెప్పి నమస్కరించి, ఆశీస్సులు పొందాను.

**పి. ఆదిలక్ష్మమ్మ.**



## పృధ్వి సుదర్శనమ్మ , తిరుపతి వారి అనుభవం:

తిరుమల కొండకు దేవుని దర్శనానికి కాలి నడకన వెళ్ళాలనుకున్నాను. అనుకున్న ప్రకారం విద్యానగర్ నుండి వస్తామన్న మా బందువులు రాలేదు. అప్పుడు నేను ఒంటరిగా వెళ్ళవలసి వచ్చినందుకు భయపడి శ్రీ మాస్టారిని, గురుదేవా! నన్ను పైకి చేర్చే భారం మీదే తండ్రి అని ప్రార్థించుకొని బయలు దేరాను. దారిలో మా బంధువులు నన్ను కలిసారు. నాకు దారిలో బాగా దాహం వేసి నడవడం కష్టమయి నడవలేక చల్లటి నీరు దొరకక ఒక చోట కూర్చున్నాము. అచట ఒక అంగడి వద్ద తెల్లటి షర్ట్, తెల్ల పంచ, పెద్ద గడ్డము గల 60 సం. ఆయన కూర్చొని ఉన్నారు. వారి వద్ద చల్లని నీళ్ళ సీసా ఉంది. వారు మంచి నీరు కావాలామ్మ అని అడిగి మాకిచ్చారు. ఆ నీరు చాలా చల్లగా ఉన్నాయి. నాకు చాలా తృప్తి కలిగింది, త్రాగి సీసా తిరిగిస్తుంటే మీరే ఉంచుకోండి అన్నారు. తరువాత మరల కొండపైకి నడచి ఎక్కుచుండగా మొకాళ్ళ పర్వతం వద్ద నేను ఎక్కలేక ఆయాస పడుతూ గురుదేవా! మీరే నన్ను పైకి చేర్చండి, అని ప్రార్దించుకున్నా, ఇంతలో ఒక పెద్దామె నన్ను చేయి పట్టుకొని కొండ పైకి చేర్చినారు. అప్పుడు నాకు స్పురించింది, శ్రీమాస్టారే దారిలో చల్లని నీరిచ్చి దప్పిక తీర్చిన వారని, నన్ను కోండ పైకి ఆ పెద్దామె రూపంలో చేర్చింది వారేననీ స్పురించి, నేను శ్రీమాస్టారిని తెలుసుకోలేక పోయానని బాధ పడ్డాను. తర్వాత శ్రీస్వామి దర్శనానికి వెళ్ళగా అచ్చట మా బంధువులకు ఉదయం 7 గంటలకు, నాకు 10 గంటలకు టోకెన్ కట్టారు. కాని నేను కూడా వారి తోపాటే దర్శనానికి 7 గంటలకు వెళ్ళగా అచ్చటి వారు మొదట అడ్డగించినా, తరువాత నన్ను కూడా పంపినారు. శ్రీ మాస్టారే నా వెంట నుండి శ్రీ స్వామి దర్శనం చేయించారు. ఈ సన్నివేశం తలచుకున్నప్పుడల్లా మాస్టారు గారికి నాపై గల ప్రేమకు ఆనందం కలుగుతుంది.

సాయినాథ మహరాజ్ కీ జై  గురుభరద్వాజ మహరాజ్ కీ జై దత్తస్వరూపులు పూజ్యులు ఆచార్య భరద్వాజ మహర్షి చిరస్మరణీయులు. ప్రాత: కాలంలో వారి దివ్య తేజస్సుతో వారి రూపాన్ని మనసాస్మరిద్దాము. వారితో నా అనుభవం అనంతం, అద్వీతీయం. వారితో నాకుగల అనుబంధం స్వర్ణయుగంగా భావిస్తున్నాను. ఈమధ్య నాకు జరిగిన అనుభవాలు మీముందు ఉంచుతున్నాను. ప్రతి దినము వారు సూచించిన విధముగా దినచర్య జరుపుతూ రాత్రి పడుకోబోయె ముందు పుణ్యకార్యములు మననం చేసుకోవటం నా అలవాటు. గురుదేవులను ఆ రోజు కూడ మననము చేసుకుంటూ నిద్రించాను. సుమారు రాత్రి 12 గంటల సమయములో స్వప్నము వచ్చినది. తెల్లటి మూడు అంతస్థుల సౌధము. పై అంతస్థు లో మాష్టారుగారు తెల్లని బనీను వేసుకుని కూర్చుని ఉన్నారు (క్రింద అంతస్థులో నేను ఉన్నాను) అయన పై నుండి క్రిందకు దిగివచ్చి కాలేజీ వీషయాలు మాట్లాడి సాధన ఎలా ఉంది? అని అడిగారు. అంతా మీ ఆశీర్వచనము, నాపరిస్థితి ఏమిటి? అని అడిగాను, మీరు ప్రస్తుతం చేస్తున్న కార్యక్రమాలు అలాగే చేసుకుపోండి. క్రమంగా ఒక్కొక్క అంతస్థు ఎక్కి నాదగ్గరకు చేరుతారు. మీకు ఇంతకుముందే అభయమిచ్చానుకదా! గుర్తులేదా? అని పకపకా నవ్వారు. ఇంతలో మెలుకవ వచ్చింది. మాష్టారి దివ్య దర్శనం ఇట్లా అయ్యింది.

మాష్టారు గారి విగ్రహ ప్రతిష్ఠ విద్యానగర్‌లో చర్చనీయాంశమైనది. ఉండాలని కొందరు, మరి కొందరు - కాలేజీ లెక్చరరు, మామూలు మనిషి ఆయనకు విగ్రహమేమిటి? అని తర్కించేవారు కొందరు. మాష్టారు గారంటే ఏ విధమైన నమ్మకము లేని ఒక భక్తుడు మాష్టారుగారు నిజంగా మహనీయుడైతే, పూజ్యనీయుడైతే మాఇంటిలో నేను అడగకుండానే ఎవరైనా వచ్చి సాయి సత్యన్నారాయణ వ్రతం జరిపించాలి అని మనసులో అనుకున్నారు. చాలా కొద్ది రోజులకే



ఆయనకు నిదర్శనం దొరికింది. ఒక పూజారి ఆయనను మీ ఇంట్లో సాయి సత్యన్నారాయణ వ్రతం జరపాలని అనుకుంటున్నాను. మీకేమైనా అభ్యంతరమా అని ఆయన్ని అడిగేటప్పటికి ఆయన ఆశ్చర్యపోయారు. గురువారం నిజంగానే వారింటికి వచ్చి సాయి సత్యవ్రతం జరిపి భిక్ష స్వీకరించారు. అప్పటినుంచి ఆ భక్తునకు మాష్టారు గారి మీద నమ్మకము గౌరవం ఏర్పడ్డాయి. నిత్యం హారతులు, అభిషేకములో పాల్గొంటున్నారు. ఇపుడు వారు ఎంతో శ్రద్ధతో సాయి పథంలో నడుస్తున్నారు. ఇదంతా మాష్టారుగారి ఆశీర్వచనం కాదా? అని చెప్పారు.

జి. సూర్య ప్రకాశరావు గారు, విద్యానగర్

## తాను చెప్పిన బోధకు తానే ఉదాహరణగా నిలచిన శ్రీ మాష్టార్:

మన చేతికొచ్చిన ప్రతి పైసాను సద్వినియోగం చేయాలి. మన దగ్గరకొచ్చిన డబ్బంతా మనది కాదు. ఆ డబ్బును భగవంతుడు మన దగ్గర పెట్టి దానిని సద్వినియోగం చేయమంటే మనం మన భోగలాలసత్వానికి ఉపయోగిస్తే భవిష్యత్ జన్మలలో అన్నానికే బాధ పడవలసివస్తుందనేవారు. నీ శరీరంలోని ప్రతి జీవకణము, ప్రతి రక్తపు బొట్టు భగవంతుని చేత పంచభూతాల ద్వారా శరీరరూపంలో ఉంచబడింది. శరీరమే నీది కానప్పుడు డబ్బు మాత్రం నీదెలా అవుతుంది. ధనాన్ని ధర్మ చింతనతో పరోపకారం కొరకు వాడమనేవారు. ఉదాహరణకు:- ఒకసారి ఒంగోలు నుండి నెల్లూరు వస్తూ శ్రీ డి. జయచంద్రారెడ్డి గారికి లెటర్ వ్రాసి ట్రెయిన్ దగ్గర ఉండమని, సాయంకాలం వరకు నెల్లూరులో కొన్ని పనులు చూచుకొని వెళ్ళిపోతానని వ్రాశారు. రెడ్డిగారు రోజుకు వందరూపాయలిచ్చేటట్లు ఒక ఆటో మాట్లాడి రైల్వే స్టేషన్ దగ్గరున్నాడు. శ్రీ మాష్టారు గారితో, ఆటో అతను సాయం

కాలం వరకు మనతో ఉంటాడు. మీరు ఆటో ఎక్కండి నేను లూనా మీద మీతో వస్తుంటానని చెప్పాడు. శ్రీ మాష్టారు ఒక్క నిమిషం ఆలోచించి ఆటో అతనికి పది రూపాయలిచ్చి పంపించేయ్. మనం లూనా మీద పోదాములే అని ఆటోను పంపించేసి ఎంత అసౌకర్యమైనా లూనా మీదనే తిరిగిన ధర్మమూర్తి వారు.

ఎప్పుడు ఒంగోలు వెళ్ళాలన్నా పాసింజర్ రైలు టిక్కెట్టు కొనమనేవారు. ఎక్స్‌ప్రెస్ కైతే పాసింజరు కంటే రెట్టింపు చార్జి. అలా మిగిలిన ధనాన్ని ప్రజోపయోగ కార్యాలకు వాడే వారు. ఎంతమంది బీద విద్యార్థులను చదివించారో ఎంతమందికి జీవనోపాధి కల్గించారో, ఎన్ని పుస్తకాలు ప్రింట్ చేసి ఉచితంగా పంచారో ఎంత వైద్య సేవచేశారో చెప్పలేము. ఈవిధంగా ప్రజలందరూ బాబా రూపాలుగా చూచి వారికి సేవచేయబట్టే నేడు మహా సమాధి అనంతరం కూడా భౌతిక దర్శనాలిస్తున్నారు. వారు ఆచరణ ద్వారా బోధించినదాన్ని కొంతైనా ఆచరించి తరించమని మన ఆచరణకై ఎదురు చూస్తున్నారు.

## గమనిక

శ్రీ స్వామివారికి దక్షిణ పంపేవారు వ్యక్తుల పేర్లతో పంపరాదు. "టు ది రిసివర్, శ్రీ వెంకయ్యా స్వామి ఆశ్రమము, గొలగమూడి (పోస్టు), (వయా) సర్వేపల్లి, నెల్లూరు జిల్లా - 524 321" అనే అడ్రసుకు పంపవలెను.



## మా ఇతర ప్రచురణలు:

| | | |
|---|---|---|
| 1. | వార్తా లాపము | 150 రూ\|\| |
| 2. | అవధూత లీల - అరవం | 50 రూ\|\| |
| 3. | శ్రీ వెంకయ్యా స్వామి - అరవం, చిన్న పుస్తకం | 5 రూ\|\| |
| 4. | అవధూత లీల - శ్రీ వెంకయ్యా స్వామి వారి చరిత్ర నిత్య పారాయణ గ్రంధము, తెలుగు | 40 రూ\|\| |
| 5. | అవధూత లీల - ఇంగ్లీషు | 30 రూ\|\| |
| 6. | శ్రీ వెంకయ్యా స్వామి - ఇంగ్లీషు, చిన్న పుస్తకం | 5 రూ\|\| |
| 7. | శ్రీ ధునీవాలా దాదా చరిత్ర | 15 రూ\|\| |
| 8. | అవధూత బోధామృతము - శ్రీ స్వామి వారి బోధలు | 15 రూ\|\| |
| 9. | శ్రీ స్వామి సన్నిధి - శ్రీ స్వామివారి సేవకుల అనుభవాలు | 15 రూ\|\| |
| 10. | మౌన బోధ | 1 రూ\|\| |
| 11. | పిలచిన పలికే దైవం | 1 రూ\|\| |
| 12. | ధర్మమూర్తి | 1 రూ\|\| |
| 13. | బోధ యజ్ఞాయ నమ: | 1 రూ\|\| |
| 14. | దివ్య లీలలు | 1 రూ\|\| |
| 15. | శ్రీ వెంకయ్యా స్వామి వారి పూజ | 1 రూ\|\| |
| 16. | శ్రీ స్వామి కృప | 1 రూ\|\| |
| 17. | శ్రీ స్వామి వారి భజన పాటలు | 1 రూ\|\| |
| 18. | ఆచార్య భరద్వాజ గారి సత్‌సంగము | ఉచితము |
| 19. | శ్రీ మాష్టారి మంచిమాట - శ్రీ E.భరద్వాజ గారి దివ్యవాణి | ఉచితము |
| 20. | శ్రీ భరద్వాజ గారితో భక్తుల అనుభవాలు | ఉచితము |
| 21. | శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ చరిత్ర | ఉచితము |
| 22. | మృత్యువు పై ఘనవిజయము | ఉచితము |
| 23. | మన ధర్మము - కర్తవ్యము | ఉచితము |
| 24. | శ్రీ సుధీంద్ర బాబు గారు | ఉచితము |
| 25. | స్మృతిమాత్ర ప్రసన్నాయ నమ: | ఉచితము |
| 26. | స్మృతిరహిత ప్రసన్నాయ నమ: | ఉచితము |
| 27. | జ్ఞానేశ్వరి భగవద్గీత | 250 రూ\|\| |